క్లుప్తంగా

ఆర్టీసీ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆర్టీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి, ఓస్వ కమిటీ నేతలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఆఫీస్ క్యాలెండర్ ఉందని డీపీటీవో చెంగల్‌రెడ్డి కితాబిచ్చారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఆఫీస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓస్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కేహెచ్‌రెడ్డి, సీసీఎస్ డెలిగేట్ ఈశ్వర్ రెడ్డి, ఎన్‌వీ బాబు హాజరయ్యారు.

కండలేరు జలాల విడుదల

రాపూరు: నెల్లూరు, తిరుపతి జిల్లాలకు కండలేరు జలాలను విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, కండలేరు జలాశయం హెడ్‌రెగ్యులేటర్ సత్యసాయిగంగ కాలువ నుంచి శుక్రవారం నెల్లూరు, తిరుపతి జిల్లాలకు తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. మొదటగా హెడ్‌రెగ్యులేటర్ మూడో వెంట్ ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు జలాశయంలో 12 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, రాపూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రజల నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సాగు నీటికి వినియోగించరాదని ఆయన సూచించారు. ఫిబ్రవరి 15 వరకు తాగునీటిని విడుదల చేస్తామన్నారు. ఆయన వెంట కండలేరు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య ఉన్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు రూరల్: బస్సులో అక్రమంగా తరలిస్తున్న పది కిలోల గంజాయిని శుక్రవారం గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గూడూరు రూరల్, చిల్లకూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. జాతీయ రహదారి బూదనం టోల్ ప్లాజా వద్ద శుక్రవారం వేకువ జామున తణుకు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా అందులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పందంగా కనిపించడంతో వారి లగేజ్ తనిఖీ చేసినట్లు వెల్లడించారు. అందులో రెండు ప్యాకెట్లలో పది కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పార్వతీపురానికి చెందిన వాకా డి.ఈశ్వర్, రమణమ్మ(అంజలి) భార్యాభర్తలని, వీరు ఆటో నడుపుకుని జీవనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తిరుపతిలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిద్దరిపై కేసులు నమోదు చేశారు.











మాన్యువల్ స్కావెంజర్ పనులు నిషేధించండి

- 2013 పునరావాస చట్టం అమలు
- సఫాయి కరంచారీల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న సఫాయి కరంచారి జాతీయ కమిషన్ సభ్యులు పీపీ వవా

తిరుపతి అర్బన్: పునరావాస చట్టం 2013 ప్రకారం మాన్యువల్ స్కావెంజర్ పనులను నిషేధించాలని సఫాయి కరంచారి జాతీయ కమిషన్ సభ్యులు పీపీ వవా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఫాయి కరంచారీ జాతీయ సభ్యులు కలెక్టర్ కే. వెంకటరమణారెడ్డి, అదనపు ఎస్పీ కులశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్యలతో కలిసి మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, ఎల్‌డీఎం తదితర శాఖల అధికారులతో పారిశుద్ధ్యకార్మికులతో చేయించే మాన్యువల్ స్కావెంజర్ పనుల నిషేధంతోపాటు పునరావాస చట్టం 2013 అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు పీపీ వవా మాట్లాడుతూ పంచాయతీల్లో కానీ, మున్సిపాలిటీల్లో కానీ ఇతర ప్రాంతాల్లో కానీ మ్యానవల్‌గా మురుగు శుభ్రం చేసే చర్యలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. సఫాయి కారంచారీల సంక్షేమమే లక్ష్యంగా కమిషన్ పనిచేస్తోందని వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల అలానే ఉన్నాయని చెప్పారు. ఆ మేరకు పలుచోట్ల సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా మ్యాన్యువల్ స్కావెంజర్లు ఉన్నచో వారిని ఆ వృత్తి నుంచి బయటపడడం కోసం వారికి వన్‌టైం సెటిల్మెంట్‌గా రూ.40 వేలు అందించాలని సూచించారు. అంతేకాకుండా ఆ కుటుంబంలోని పిల్లలకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, స్కాలర్ షిప్, ఇల్లు లేని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా గృహం మంజూరు చేసి, ఆసరాగా ఉండాలని ఆదేశించారు. ఆ కుటుంబంలో 18ఏళ్ల పైబడిన వారు ఉంటే స్వయం ఉపాధిపై శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించి బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే మ్యాన్యువల్ స్కావెంజర్ మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి గతంలో చనిపోయిన ఇద్దరు స్కావెంజర్ల కుటుంబాలకు అందించిన సాయం తెలుపమని కోరారు. దీంతో తిరుపతి మున్సిపల్ అధికారులు ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం సంఘటన జరిగిన మూడు రోజుల లోపు అందజేశామని, వారి కుటుంబంలో ఒకరికి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం కల్పించామని కమిషన్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి మ్యానువల్ స్కావెంజర్లు లేరని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ అమలు జిల్లాలో 95 శాతం పైగా సాధించామని చెప్పారు. అనంతరం జాతీయ సభ్యులను దుశ్శాలువాతో సత్కరించి.. శ్రీవారి జ్ఞాపికను అందించారు. తర్వాత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించి ఫ్లెక్సీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఈడీ నరసింహులు, ఏల్డీఎం సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎంజీ ఆస్టర్ నూతన కారు



కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై – బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెశ్విన్ ఆటో మోటార్స్ షోరూంలో శుక్రవారం ఎంజీ ఆస్టర్-2024 కారును షోరూం అధినేత ఉదయ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కారును తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లోని తమ బ్రాంచీల్లో ఒకేసారి మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వాహనం ప్రారంభ ధర రూ.9.98 లక్షలని తెలిపారు. ఇందులో ఏడీఎస్‌ఎస్-ఎల్-2, 49 సేఫ్టీ, అతిపెద్ద సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా కారు కొనుగోలుపై గోల్డ్ కాయిన్, రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్‌లోని శ్రీవేంకటేశ్వర అకాడమీలో శనివారం ఉదయం 10గంటలకు గ్రూప్-2 పరీక్షపై ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమీ డైరెక్టర్ ఎస్.గీతాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతోపాటు ఉచితంగా మెటీరియల్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 81793 92526 నంబరులో సంప్రదించాలన్నారు.

సంక్రాంతి వేడుకలు



తిరుపతి కల్చరల్: భవిష్యత్తు తరాల వారికి సంస్కృతి, సాంప్రదాయాల నైతిక విలువలను తెలియజేసే మూడు రోజుల పండుగ సంక్రాంతి అని దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ తెలిపారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం సూచనల మేరకు భవాని నగర్ క్లస్టర్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

హాకీ చాంపియన్ తిరుపతి

- రన్నర్స్‌గా వైఎస్సార్ కడప
- ముగిసిన 14వ హాకీ ఏపీ జూనియర్ మెన్ పోటీలు



బహుమతులను ప్రదానం చేస్తున్న హాకీ సమాఖ్య ప్రతినిధి

తిరుపతి రూరల్: తిరుపతి వేదికగా మూడు రోజులు సాగిన 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మెన్ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఎస్వీయూ క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తిరుపతి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. 2-1 తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన హాకీ జట్ల మధ్య పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు నిలవగా, అన్నమయ్య జిల్లా జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్, చిల్లీస్ హోటల్ ప్రతినిధి రాజా బహుమతులు అందజేశారు. హాకీ పోటీలు సజావుగా సాగేందుకు రూ.50 వేలు అందజేయడంతో పాటు సహకారం అందించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకారం అందించిన ఫ్రీడమ్ ఫ్రమ్ హంగర్ సంస్థ ప్రతినిధులు, చిల్లీస్ హోటల్ సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. హాకీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, డీఎస్‌డీవో సయ్యద్ బాషా, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి, చిల్లీస్ హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రెడ్ ఎఫ్ఎం 93.5, ఆశీర్వాద్ మసాలా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాల, రాయలసీమ కళాశాలలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో యువతులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు బహుతులు అందజేశారు. ఆశీర్వాద్ మసాలా మేనేజర్ లోకేష్, రెడ్ ఎఫ్ఎం మేనేజర్ శ్రీధర్, సేల్స్ హెడ్ జయంతి, ఫైనాన్స్ మేనేజర్ యోగేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో సి.నిఖిత్ 400మార్కులకు 360, ఎస్.సౌమ్య 354, ఎన్.దివాకర్‌రెడ్డి 354, కె.ద్వారకనాథరెడ్డి 348, ఎస్.అయూబ్ 338, ఎస్.ఆరిఫుల్లా 334, బి.యోగేష్ 330 మార్కులు సాధించారని తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు 91.67శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

కారు చోరీ

చంద్రగిరి: మండలంలోని తొండవాడ సమీపంలో గురువారం రాత్రి ఇంటి వద్ద ఉంచిన కారు చోరీకి గురైంది. బాధితుడి కథనం మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నరేంద్రరెడ్డి తొండవాడ సమీపంలోని ఓ విల్లాలో నివాసం ఉంటూ ఆరు ఎకరాల్లో పశువులు, కోళ్లు, మేకల వ్యాపారం చేస్తున్నాడు. అతను గురువారం రాత్రి తన కారును ఇంటి ముందు నిలిపి నిద్రించాడు. తెల్లవారుజామున తన సెల్‌ఫోన్‌కు ఫాస్ట్ ట్యాగ్ మెసేజ్ రావడంతో ఇంటి బయటకు వచ్చి చూశాడు. కారు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రేణిగుంట- నంద్యాల రైలు ప్రారంభం



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

రేణిగుంట : రేణిగుంట–నంద్యాల ప్రత్యేక రైలు సర్వీసును శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట రైల్వే జంక్షన్‌లో గుంతకల్ ఏడీఆర్ఎం సూర్యనారాయణ ప్రారంభించారు. నంద్యాల– కడప వరకు నడుస్తున్న డెమో రైల్వే సర్వీసును రేణిగుంట వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో రాష్ట్రంలో మూడు నూతన రైలు సర్వీసులను ప్రారంభించారు. అందులో భాగంగా రేణిగంట నుంచి ఏడీఆర్ఎం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అభ్యర్థన మేరకు స్థానికుల సౌకర్యార్థం నంద్యాల నుంచి కడప వరకు పరిమితమైన రైలు సర్వీసును రేణిగుంట వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ రైలు ప్రతిరోజూ మధ్యాహ్నం 3.45 గంటలకు రేణిగుంట నుంచి బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన డీఆర్‌వో సభ్యుడు మురళీకృష్ణ ప్రయాణికుల సౌకర్యార్థం వీల్‌చైర్లు, టీషర్టులు, రగ్గులు పంపిణీ చేశారు.

ఘాట్‌రోడ్డులో రెండు వేర్వేరు ప్రమాదాలు

- ఒకరి మృతి, మరో మహిళకు తీవ్ర గాయాలు



మృతురాలు దాసరి జ్యోతి

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒక మహిళ మృతిచెందగా, మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తిరుమల ట్రాఫిక్ పోలీసుల కథనం.. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెనుక వైపు కొండపైన నివాసం ఉంటున్న ఏ.మ్యాదారి సంతోష్‌కుమార్, దాసరి జ్యోతిమహా (18) భార్యాభర్తలు. వీరిద్దరూ శ్రీవారి దర్శనార్థం మరో ఇద్దరితో కలిసి తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని స్థానిక నాదనీరాజనం వద్ద నిద్రపోగా.. వారి పర్సు చోరీకి గురైనట్లు సమాచారం. దీంతో వీరు జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకుని ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి మొదటిఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రిబుల్ రైడింగ్‌లో వస్తున్న వీరి వాహనాన్ని 16 మలుపు వద్ద బస్సు అధిగమించబోయింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాకొట్టింది. జ్యోతిమహా తలకు తీవ్రగాయాలవ్వడంతో ఆమెను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలావుండగా మరో ప్రమాదంలో తమిళనాడుకు చెందిన భార్యాభర్తలు తిరుమల శ్రీవారి దర్శనార్థం ద్విచక్ర వాహనంలో తిరుమలకు చేరుకున్నారు. అనంతరం మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతున్న సమయంలో 16 మలుపు వద్ద వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో భార్య లోకేశ్వరి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది గాయపడిన మహిళను అశ్విని ఆస్పత్రికి తరలించారు. పై రెండు ప్రమాదాలపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గాండ్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: అఖిల భారత గాండ్ల తెలికుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం పద్మావతిపురంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు సాకం నాగరాజు, బండారు శ్రీనివాస్, సాకం ప్రభాకర్, వెంకన్న, శంకర్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్య



ట్యాబులు అందుకున్న విద్యార్థులు

రామచంద్రాపురం: ప్రభుత్వ బడుల్లో డిజిట్ విద్యను అమలు చేసేందుకే విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేస్తోందని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలయ్య అన్నారు. శనివారం మండలంలోని కమ్మకండ్రిగ జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు సామ్‌సంగ్ ట్యాబులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎంఈఓ జయవేలు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువులో బాగా రాణించాలన్నారు. హెచ్‌ఎం వాగ్దేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహేష్‌బాబు సినిమా వద్ద అన్నదానం



పాకాల: రామకృష్ణ డీలక్స్‌లో గుంటూరు కారం సినిమా రిలీజైన సందర్భంగా ఈ-పాలగుట్టపల్లి పంచాయతీకి చెందిన అభిమాని చలం చలపతి, చిన్నారి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సినిమా థియేటర్ వద్ద ప్రేక్షకులకు, పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సినిమా పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. హేమంత్‌రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద



వేడుకల్లో విద్యార్థులతో ఆర్‌కే అబాకస్ అధినేత డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభిస్తున్న రామకృష్ణ మిషన్ ఆశ్రమ ప్రతినిధులు, వక్తలు



నివాళులర్పిస్తున్న ఆపస్ నాయకులు

తిరుపతి కల్చరల్: యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద అని ఆర్‌కే అబాకస్ అధినేత డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎం.ఆర్.పల్లి, కె.టి.రోడ్డు నందు గల ఆర్‌కేఅబాకస్ శిక్షణా కేంద్రాల్లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్య మూర్తి అయిన స్వామి వివేకానంద జీవిత వృత్తాంతాన్ని పిల్లలకు చక్కగా వివరించారు. ముఖ్య అతిథి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌కే అబాకస్ డైరెక్టర్ ఆర్‌కే విమల వివేకానంద పుస్తకాలను బహుమతిగా విద్యార్థులకు అందజేశారు.

మానవాళికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

తిరుపతి ఎడ్యుకేషన్: మానవాళికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. సీహెచ్ శ్రావణ్‌కుమార్, జి.సాంబిరెడ్డి, సుభాష్ చంద్రదాస్, పట్టాభి, కార్యదర్శి మహేష్, మధు మేనకాపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

తిరుపతి రూరల్: దేశ కీర్తిప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో మాస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. గంగిరెడ్డి, సీవీ రమణ, కోటేశ్వరరావు,శేఖర్‌రెడ్డి, శంకర్‌బాబు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలు స్ఫూర్తి కావాలి

తిరుపతి కల్చరల్: స్వామి వివేకానంద బోధనలను ఆకళింపు చేసుకుని ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని తమ ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి పోటీలలో గెలుపొందిన విజేతలకు రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ నిరంజన్‌బాబు, ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద వక్తలుగా హాజరై ప్రసంగించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్వీ వైద్య కళాశాల కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వివేకానంద గీతావళి గానం చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఆప్యాయత పంచుతూ... ఆత్మీయత చాటుతూ..



పెరుమాళ్లపల్లెలో పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

- పెరుమాళ్లపల్లెలో కొనసాగుతున్న చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర
- తామంతా మోహిత్‌రెడ్డి వెంటే అన్న గ్రామస్తులు

తిరుపతి రూరల్: అడుగడుగునా ఆప్యాయతను పంచుతూ...గడప గడపలో ఆత్మీయతను చాటుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పెరుమాళ్లపల్లిలో చేపట్టిన పాదయాత్రకు అపూర్వ ఆదరణ లభించింది. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెలో రెండో రోజు శుక్రవారం చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర కొనసాగింది. ప్రతి గడపలో జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తూ, ఆ గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. తండ్రి బాటలో నడిచే చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులను ఆత్మీయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. గడప గడపలో అపూర్వ స్వాగతం లభించింది. ఆమె స్థానికులతో మమేకమై రానున్న ఎన్నికల్లో తన బిడ్డను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమకెంతో మేలు చేశారని, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని తప్పకుండా ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని మహిళలు మాట ఇచ్చారు. అంతకు ముందు గ్రామ దేవతలకు చెవిరెడ్డి లక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో ఆమె వెంట నడిచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి మద్దతు తెలిపారు. సర్పంచ్ జోగి మోహన్, మాజీ సర్పంచ్ రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దగంగమ్మ ఆలయ పనులు పరిశీలన



తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయంలో చేపడుతున్న నూతన ఆలయ నిర్మాణ పనులను టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపడుతున్న పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ పనుల నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు తీసుకుంటూ త్వరితగతిన ఆలయ పనులను పూర్తి చేసి అమ్మవారి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మమత, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కియా న్యూ సోనెట్ కారు ఆవిష్కరణ



నూతన కారును ఆవిష్కరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై–బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో శుక్రవారం సాయంత్రం కియా న్యూ సోనెట్, ది న్యూ వైల్డ్ రీబోర్న్ నూతన కారు ఆవిష్కరణ జరిగింది. మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్ చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషమా రెడ్డి, అశీష్ రెడ్డిలతో పాటు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా న్యూ సోనెట్, ది న్యూ వైల్డ్ రీబోర్న్ కారులో అత్యాధునిక సదుపాయాలు ఇచ్చామన్నారు. బెస్ట్ సేఫ్టీతో రోబస్ట్ 15 హై సేఫ్టీ ప్యాకేజీను ఇందులో ఉపయోగించినట్లు తెలిపారు. ఈ నూతన కారులో 70 రకాల స్మార్ట్ ఫ్యూచర్స్‌ను అందులో అమర్చారని తెలిపారు. కారు ఎక్స్ షోరూం ధర రూ.7.99 లక్షల నుంచి ప్రారంభ ధర ఉందని, 8 రంగులలో ఈ కారు అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. ఈ కారు బుకింగ్ కోసం 86888 29739 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. షోరూం సీనియర్ మేనేజర్ రాజ్ కుమార్, మేనేజర్ సోమనాథ్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

650 మందికి మళ్లీ ఉద్యోగాలు ఇవ్వడం హర్షణీయం



చల్లా చంద్రయ్య

తిరుపతి అర్బన్ : క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. రోడ్డు ప్రమాదాలతోపాటు క్రమశిక్షణా చర్యల కింద రాష్ట్రంలో రెండేళ్లలో 650 మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు పేర్కొన్నారు. వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇకపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల నుంచి అప్పీల్‌ను స్వీకరించే అధికారం ఆయా డిపో మేనేజర్లకు ఇచ్చారని తెలిపారు. డెప్యూటీ సీటీఎంలు లేదా డీపీటీవో స్థాయి అధికారులు అక్కడికక్కడే విచారణ జరిపి వారికి తిరిగి ఉద్యోగాలు ఇచ్చే అధికారాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. అన్ని సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించాల్సి రావడంతో జాప్యం చోటుచేసుకునేదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ స్మృతివనం సామాజిక న్యాయానికి స్ఫూర్తి



మాట్లాడుతున్న మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: అంబేడ్కర్ భావజాలంతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతి వనం సామాజిక న్యాయానికి స్ఫూర్తిదాయకమని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సంక్షమ ఫలాలను అందిస్తూ ప్రజల గుండెల్లో సంక్షేమ సారథిగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విజయవాడలో రూ.400 కోట్లతో 18 ఎకరాలలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుతో పాటు 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, బడుగుల ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. దేశంలోనే కనీవిని ఎరుగని రీతితో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని బడుగు బలహీన వర్గాలందరూ అధిక సంఖ్యలో విజయవాడకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్, బీసీ నేతలు నాగేంద్ర, నాని పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీరోడ్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల కూడలిలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాటిబండ మురళి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్ రెడ్డి, బాబు, రితిక్, రోషన్, మునికృష్ణ పాల్గొన్నారు.